క్లుప్తంగా

టీకాలు తప్పనిసరిగా వేయించాలి



సరిపల్లెలో చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: టీకాలు చిన్నారుల ఆరోగ్యానికి రక్షణగా నిలుస్తాయని అందువల్ల ప్రతి చిన్నారికి నిర్ధేశించిన సమయంలో టీకాలు తప్పకుండా వేయించాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారి పి.కిరణ్మయి అన్నారు. శనివారం గణపవరం మండలం సరిపల్లెలో సార్వత్రిక వ్యాధినిరోధక టీకాల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గర్భిణులకు, సంవత్సరంలోపు, ఐదేళ్లలోపు పిల్లలకు టీకాలు, వాక్సీన్లు వేశారు. గర్భిణులు టీడీ వాక్సిన్ మొదటి, రెండు డోసులు సకాలంలో వేయించుకోవాలని, ఐరన్, కాల్షియం ట్యాబ్లెట్లు 180 తప్పని సరిగా వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపు సర్వే



గణపవరం: కాశిపాడులో కుష్టు వ్యాధి గుర్తింపు కార్యక్రమం

గణపవరం: కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. శనివారం పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో లెప్రసీ డిటెక్షన్ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క ఇంటినీ వదలకుండా ప్రతి ఒక్కరికీ కుష్టు నిర్ధారణ పరీక్ష చేయాలని సూచించారు. స్పర్శలేని మచ్చలు, రాగి రంగులో మచ్చలు, ఒకటి లేదా ఐదు మచ్చలు ఉంటే వెంటనే వైద్యాధికారి వద్దకు పంపాలని సూచించారు. సీహెచ్‌వో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సర్వే ఆగస్టు 2వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. ఆరోగ్య సహాయకుడు నామాలరాజు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


గుండేరువాగు పరిశీలన



గుండేరువాగును పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న పెదవేగి సీఐ

దెందులూరు: దెందులూరు సైఫన్ వద్ద వస్తున్న గుండేరువాగును శనివారం పెదవేగి సీఐ కె.శ్రీనివాసకుమార్ పరిశీలించారు. రాత్రి వేళల్లో వర్షాలకు, ఎగువ ప్రాంతాల నుంచి హఠాత్తుగా వచ్చే నీటి వల్ల ఉధృతి పెరిగే అవకాశం ఉండటంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎటువంటి సంఘటన జరిగినా మండల, జిల్లా అధికారులకు తెలియచేయాలన్నారు. రాత్రి 7 గంటలు దాటిన తరువాత రాకపోకలు తగ్గించాలని ప్రజలకు సూచించారు.

శాకాంబరిదేవి అలంకరణలో రాట్నాలమ్మ



రాట్నాలమ్మకు శాకాంబరి అలంకరణ

దెందులూరు: రాట్నాలకుంటలోని రాటాన్లమ్మవారి ఆలయంలో ఏటా గురు పౌర్ణమి వరకు శాకాంబరిదేవి ఉత్సవాలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో చాలా ప్రాంతాల్లో ఇదే సంప్రదాయం పాటిస్తున్నారు. అమ్మవారి శాకాంబరీదేవి అవతారం మంచి ఆకలిని తీర్చడానికి ఉద్భవించింది. కూరగాయలు, ఆకుకూరలతో శోభాయమానంగా అమ్మవార్లను అలంకరిస్తారు. శనివారం శాకంబరిదేవి అలంకరణలో రాట్నాలమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వాటర్ ట్యాంకర్ సేవలు ప్రారంభం

దెందులూరు: రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ నేత్రదానం చేశారు. దివంగత కొలుసు వీర వెంకట సత్యనారాయణ (బాబూరావు) పేరిట ఉచిత వాటర్ ట్యాంక్‌ను ఆదివారం నుంచి దెందులూరులో ఉచితంగా సేవలు పొందవచ్చని ఆయన కుమారులు కొలుసు నాని, శివ తెలిపారు. కొలుసు బాబూరావు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సంగతి విదితమే. తమ తండ్రి సేవలు చిరకాలం గుర్తుండాలని ఆయన జ్ఞాపకార్థం వాటర్ ట్యాంకర్‌ను ఏర్పాటు చేశామని నాని, శివ అన్నారు.

ఎడతెరపి లేని వానతో ఇక్కట్లు

- వరదనీటిలోనే వరినాట్లు, నారు
- గ్రామాల్లో క్షీణిస్తున్న పారిశుద్ధ్యం

గణపవరం: ఎడతెరపి లేని వర్షాల కారణంగా జనజీవనం అస్తవ్యస్తమైంది. పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మూడు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు గణపవరం మండలంలో వరినాట్లు వేసిన పొలాలన్నీ ముంపుబారిన పడ్డాయి. ఇప్పటివరకూ 3,500 ఎకరాల్లో వరినాట్లు వేయగా మొత్తం నాట్లువేసిన పొలాలన్నీ నీట మునిగాయి. మరో 180 ఎకరాల్లో నారుమడులు నీట మునిగిపోయాయి. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వరి నాట్లు నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం వరినాట్లు సగానికి పైగా మునిగి వరిమొక్కల చివర్లు కనిపించగా, శుక్రవారం రాత్రి నంచి వర్షం ఏకధాటిగా కురవడంతో వరినాట్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. శనివారం గణపవరం మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వై.రాంబాబు, మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ పర్యటించి, ముంపునకు గురైన పొలాలను, నారు మడులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో పల్లపు ప్రాంతాలను శివారు ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు రావాలని సూచించారు. ఎ.గోపవరం, జల్లికాకినాడ, కొండేపాడు, వాకపల్లి, కాశిపాడు, పిప్పరలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లపై చేరిన బురద, మురుగును కూలీలతో తొలగించి, బ్లీచింగ్ చల్లుతున్నారు.

సస్యరక్షణ తప్పనిసరి

భారీ వర్షాల కారణంగా ముంపుకు గురైన పొలాలు, నారుమడుల్లో రైతులు తప్పని సరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి యర్రంశెట్టి ప్రసాద్ రైతులకు సూచించారు. కొమ్మర, అర్ధవరం, వల్లూరు, గోపవరం, పిప్పర, కోమర్రు, మొయ్యేరులో ఆయన పర్యటించి రైతులకు సూచనలు ఇచ్చారు. వర్షం తగ్గగానే రైతులు చేలల్లోని నీటిని పూర్తిగా బయటకు తీసివేసి వరి మొక్కలకు పూర్తిగా గాలితగిలేలా చూడాలని, 5సెంట్ల నారు మడిలో కిలో యూరియ, కిలో పొటాష్ వేయాలన్నారు. నాట్లు ముంపునకు గురైతే నీరు పూర్తిగా తీసివేసిన తర్వాత ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు. నీరు బయటకు తీసే పరిస్థితిలేని సందర్భంలో పైరుపై 2 శాతం యూరియా, లేదా పొటాషియం నైట్రేట్ ద్రావణం పిచికారీ చేయాలన్నారు.



గణపవరం మండలం జల్లికొమ్మరలో నీట మునిగిన పొలాలు



చిలకంపాడులో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు



వాకపల్లిలో రోడ్డుమీద చేరిన బురదను తొలగిస్తున్న దృశ్యం

పంట పొలాల పరిశీలన



రావులపర్రులో రైతులతో మాట్లాడుతున్న ఏడీ ఉషారాజకుమారి, శాస్త్రవేత్తలు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో వ్యవసాయ సహాయ సంచాలకులు ఉషారాజకుమారి, మండల వ్యవసాయ అధికారి బాలిన వెంకటేష్, మార్టేరు శాస్త్రవేత్తలు బృందం సభ్యులు శనివారం పర్యటించారు. మండలంలో మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఏడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వేలాది ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి.ఈ నేపథ్యంలో అధికార్లు మార్టేరు శాస్త్రవేత్తలు పొలాలను పరిశీలించి రైతలకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. గొల్లగూడెం, నాచుగుంట, ఉంగుటూరు, రావులపర్రులో పర్యటించారు.ఉంగుటూరులో ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్, సర్పంచి బండారు సింధుమధు, నాచుగుంటలో యిమ్మని గంగాధరరావు ఆయా గ్రామాల్లో నష్ట వివరాలను అధికారులకు తెలియజేశారు. ఏలూరు ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ కె.మణికుమార్, శాస్త్రవేత ఎ.గిరిజారాణి, మార్టేరు ఆర్ఏఆర్ఎస్ఎన్. వెరోనికా, డీఆర్సీ శ్రీదేవి, రెవెన్యూ అధికార్లు పాల్గొన్నారు.

కొండేపాడు వద్ద ఎర్రకాలువ ఉగ్రరూపం



కొండేపాడు వద్ద ఎర్రకాలువకు పోటెత్తిన వరదనీరు



కొండేపాడువద్ద కొత్త వంతెన వద్ద ఎర్రకాలువ ఉగ్రరూపం

గణపవరం: ఎస్.కొండేపాడు గ్రామానికి ముంపు ప్రమాదం పొంచి ఉంది. గణపవరం మండలంలో శివారు గ్రామమైన కొండేపాడు ఎప్పుడూ ముంపునకు ముందు ఉంటుంది. సమీపంలో ప్రవహించే ఎర్రకాలువకు వరదలు వస్తే ముందుగా కొండేపాడు మునిగిపోతుంది. ఏటా వర్షా కాలం వచ్చిందటే గ్రామస్తులు బిక్కు బిక్కుమంటూ కాలం గడుపుతుంటారు. ఈ గ్రామం చుట్టూ ఎర్రకాలువతోపాటు మరో రెండు మేజర్ డ్రెయిన్లు ప్రవహిస్తున్నాయి. నిడదవోలు దగ్గర నుంచి ఈ ఎర్రకాలువ యనమదుర్రు కాలువగా పెంటపాడు, గణపవరం, ఉండి, భీమవరం మండలాల మీదుగా ప్రవహిస్తుంది. ఈ కాలువకు వరదలు వస్తే మండలంలో యనమదుర్రు కాలువ పరీవాహక గ్రామాలైన కోమర్రు, కుముదవల్లి, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, పిప్పర, వెంకట్రాజపురం, కోమట్లపాలెం, ఎస్.కొండేపాడు గ్రామాలకు ముంపు సమస్య తలెత్తుతుంది. ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహం ప్రమాదకరస్థాయికి చేరింది. ఎగువ గ్రామాల్లోని వరదనీరు వచ్చి చేరడంతో ఎర్రకాలువలో నీటి ఉద్ధృతి గంట గంటకు పెరుగుతోంది. ఇప్పటికే గణపవరం తహసీల్దార్ వై.రాంబాబు కాలువ పరీవాహక గ్రామాల్లో పర్యటించి రెవెన్యూ, పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేశారు. అవసరమైతే పునరావాస కేంద్రాల ఏర్పాటు, ముంపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంపై సూచనలిచ్చారు. పిప్పర, మొయ్యేరు, కేశవరం, కొండేపాడు తదితర గ్రామాల్లో పొలాల్లోని నీరు భారీగా చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే వరినాట్లువేసిన సుమారు మూడు వేల ఎకరాల్లో వరినాట్లు మొత్తం వరదనీటిలో మునిగిపోయాయి. యర్రకాలువ ఉగ్రరూపం దాలుస్తుండటంతో ఈ ప్రాంత ప్రజలు నిద్రాహారాలు లేకుండా బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ముంపు నీటిలో వరి చేలు

భీమడోలు: భీమడోలు, పూళ్ల, గుండుగొలను, ఎంఎంపురం, కోరుకల్లు, రత్నాపురం, గుండుగొలను శివారు ప్రాంతాల్లోని ఖరీఫ్ సాగు వరి నారుమడులు, వరి నాట్లు ముంపు బారిన పడి రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా సుమారు వెయ్యి ఎకరాల్లోని పంట చేలు నీట మునిగాయి. శనివారం ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి పంట చేలు ముంపుబారిన ఉన్నాయి. ప్రధానంగా డ్రెయిన్లను ఆక్రమించుకుని ఆక్వా చెరువులను తవ్వడం వల్ల ముంపు నీరు కిందకు పారే అవకాశాలు లేక నీరంతా పంట చేలల్లో పడి నానుతున్నాయి. సంబంధిత డ్రెయినేజీ, ఇరిగేషన్, ఉపాధి హామీ అధికారులు ముంపు నివారణ చర్యలు పట్టలేదు. గతేడాది గుండుగొలను, లక్ష్మీపురం ఏరియాల్లో డ్రెయిన్లలోని పేరుకుపోయిన మట్టిని పూడిక తీశారు. అయినప్పటికీ కోరుకల్లు, రత్నాపురం పంట కాలువలను పూడిక తీయకపోవడంతో మురుగు నీరంతా పంట చేలను ముంచెత్తుతున్నాయి. భీమడోలు ఏరియాల్లో ఏటా వర్షం వస్తే వరి నాట్లు, దెబ్బతింటున్నాయి. దీనితో రైతులు, కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముంపు చేలను ఏవో ఎస్‌పీవీ ఉషారాణి పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు.

స్పందించిన జిల్లా యంత్రాంగం

గుండుగొలను శివారు గరుడ హోటల్ ఎదురుగా ఉన్న పంట చేలన్నీ ముంపు నీటిలో ఉన్నాయి. కాలువలో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క, నాచుల వల్ల గోదావరి కాలువ నీరు కిందకు వెళ్లే మార్గం లేక నీరంతా సమీపంలోని పంట చేల్లోకి చేరింది. దీనితో తీవ్ర నష్టం వాటిల్లడంతో మాజీ ఏఎంసీ చైర్మన్ వగ్వాల భాస్కర్ శనివారం ముంపు బారిన పంట పొలాల సమస్యపై కలెక్టర్, జేసీలకు వాట్సాఫ్ నంబర్‌కు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఉన్నతాధికారులు భీమడోలు, దెందులూరు మండలాల తహసీల్దార్లకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఆ ప్రాంతానికి జేసీబీని తీసుకుని వచ్చి తూడు తొలగించే ప్రయత్నం చేసినా అక్కడ పరిస్థితులు సహకరించలేదు. దీనితో జేసీబీ సైతం వెళ్లే మార్గం లేనందున వర్షం తగ్గిన తర్వాత తూడు, గుర్రపు డెక్కలను తొలగిస్తామని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.



గుండుగొలను శివారులో చేలల్లో నిలిచిన ముంపు నీరు



గోదావరి కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడులు



భీమడోలులో మునిగిన వరి నాట్లును పరిశీలిస్తున్న ఏవో ఎస్‌పీవీ ఉషారాణి

పశుపోషకులు జాగ్రత్తలు పాటించాలి

దెందులూరు: వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యం ఉన్న రంగం పాడి పరిశ్రమేనని పశు సంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ గోవింద్ అన్నారు. శనివారం గోపన్నపాలెం పశుసంవర్ధకశాఖ డిప్యూటీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పశువులు, గొర్రెలు, మేకలతో పాటు కోళ్ల పెంపకానికి ఆసక్తి చూపుతున్నారన్నారు. వ్యవసాయంలో ఇబ్బంది తలెత్తినా, పాడి పరిశ్రమ ద్వారా రైతు గట్టెక్కుతాడన్నారు. మూగజీవాల పెంపకంపై అవగాహన లేక కొన్నిసార్లు వాటిని కోల్పోవాల్సి వస్తుందని, పశువైద్యులు, శాస్త్రవేత్తల సలహాలు పాటించి వర్షాకాలం పశువులకు సోకే వ్యాధులు, చికిత్స పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలంలో గిట్టల చీల్పు, నోటి గుబ్బలు, పొదుగు వాపు, గోమార్లు సోకుతాయన్నారు. పశువులు తీవ్ర అనారోగ్యానికి గురవుతాయన్నారు. సకాలంలో ఈ వ్యాధులను గుర్తించి తగు వైద్యం చేయించడం ద్వారా పశువులను కాపాడుకోవచ్చన్నారు. వర్షపు నీటితో నేల చిత్తడిగా మారడం వల్ల పలు రకాల వైరస్‌లు పశువుల శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. పశువుల పాకతోపాటు వాటిని ఉంచే ప్రదేశాల నేల పొడిగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. పశువుల పాక పైకప్పు వర్షాకాలంలో కారకుండా జాగ్రత్తపడాలని సూచించారు. షెడ్లల్లో నీరు కారడం వల్ల బురద, చిత్తడి ఎక్కువై పశువులు ఇబ్బంది పడతాయని అన్నారు. గాలి సరిగ్గా తగలకపోవడం వల్ల అమ్మోనియా వాయువు విడుదలై పశువులకు కంటి నుంచి నీరు కారుతుందన్నారు. రైతులు, పశుపోషకులు ఈ సమస్యలు గుర్తించి జాగ్రత్తగా ఉండాలన్నారు. తడిసిన వరిగడ్డి, వేరుశెనగ, కొర్రగడ్డికి బూజు పడుతుంది. వివిధ రకాల వైరస్‌లు వ్యాపిస్తాయి. అలాంటి గడ్డి పశువులు తినడం వల్ల రోగాలు తొందరగా సోకుతాయి. వర్షాకాలంలో సాధ్యమైనంతమేర వట్టిగడ్డి తడవకుండా చర్యలు తీసుకోవాలి. పచ్చిగడ్డితో మేపిన పశువులకు కడుపు త్వరగా నిండి త్వరగా ఆరుగుతుంది. ఎండుగడ్డిని కూడా పశువులకు అందించాలి.



మాట్లాడుతున్న డైరెక్టర్ గోవింద్

కుదేలైన రైతులను ఆదుకోవాలి

భీమడోలు: అకాల వర్షాలకు కుదేలైన రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని పూళ్ల, ఎంఎంపురంలో భారీ వర్షాలకు ముంపుబారిన పడిన పంట చేలను శనివారం రైతు సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఎకరాకు వరి నాట్లకు రూ.15వేల వరకు రైతులు పెట్టుబడి పెట్టారని, పైరు కుళ్లిపోయి తీవ్ర నష్టాన్ని చవిచూశారన్నారు. జిల్లా కన్వీనర్ కె.అప్పారావు, జిల్లా కోకన్వీనర్ వి.రామచంద్రమూర్తి పాల్గొన్నారు.



పూళ్లలో ముంపు బారిన పంట చేలను పరిశీలిస్తున్న కె.శ్రీనివాస్

ఇంటిగ్రేటెడ్ హాస్టల్లో వర్షం నీరు



కొవ్వలి ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లోకి వచ్చిన వర్షపు నీరు

దెందులూరు: కొవ్వలిలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ప్రాంగణంలోకి వర్షపునీరు చేరింది. హాస్టల్‌లోని విద్యార్థులకు రాకపోకలకు అసౌకర్యం లేకుండా హాస్టల్ ఉద్యోగులు, జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వందల ఎకరాల్లో వరి పైరు మునక



పోతునూరులో నీటమునిగిన వరి పొలాలు



ముంపు పొలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ జితేంద్ర, ఎంపీడీఓ శ్రీలత, ఏఓ గద్దె రమేష్

దెందులూరు: కొవ్వలి, పోతునూరు, దోసపాడులో వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. పోతునూరులో 275 ఎకరాలు, కొవ్వలిలో 220 ఎకరాలు, దోసపాడులో 75 ఎకరాల్లో వరి పైరు ముంపునకు గురయ్యాయి. శనివారం తహసీల్దార్ వీ.జితేంద్ర, ఎంపీడీఓ పీ.శ్రీలత, ఏఓ గద్దె రమేష్, మూడు గ్రామాల నాయకులు పరిశీలించారు.

ఘనంగా గురుపౌర్ణమి

దెందులూరు: వ్యాసమహర్షి పుట్టిన రోజున ఆయనను గురువుగా భావించి గురుపౌర్ణమి జరుపుకుంటామని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం దెందులూరు నర్సింగ్ కళాశాలలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువు మనలోని అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదిస్తారన్నారు. మన జీవితానికి మార్గనిర్దేశం చేసి వృత్తివైపు మనల్ని నడుపుతారన్నారు. తొలుత సుగ్గిశెట్టి సత్యనారాయణ గురువు చిత్రపటాలకు నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఏకధాటిగా కురిసిన వర్షాలతో కుంగిన రైతులు



గొల్లగూడెం వద్ద నీటలో మునిగిన చేలను పరిశీలిస్తున ఏవో వెంకటేష్



నారాయణపురం ఆయకట్టులో ముంపు బారిన పంట పొలాలు

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షలకు ఎక్కడచూసినా నీరు కనిపిస్తోంది. శనివారం 38.8మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాలుగురోజులకు 193.4మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. పంట పొలాలు నీట మునిగాయి. గ్రామాల్లోకి వరద నీరు చొరబడింది. మెట్ట ప్రాంతంలో మైనర్ ఇరిగేషన్ చెరవులు నిండిపోయాయి. పోలవరం కాలువ, తాడిపూడి కాలువలోకి వరద నీరు వచ్చింది. వెల్లమిల్లి ఆయకట్టులో సుమారు 500 ఎకరాలు, కైకరం ఆయకట్టులో 300 ఎకరాల్లో వరి పైరు నీటమునిగింది. కొల్లేరు పరివాహక ప్రాంత గ్రామాలైన లంకమాలపల్లి, రామన్నగూడెం, వీకే పురం, రామన్నగూడెం ప్రాంతంలో పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. ఉంగుటూరు ఎర్రచెరువు పొంగి ప్రవహించడంతో పరివాహక ప్రాంతంలో పొలాలు నీటమునిగాయి. ముంపు బారిన పడిన పంట పొలాలను ఉంగుటూరులో సర్పంచి బండారు సింధు, ఏఎంసీ మాజీ చైర్మన్ పాతూరి విజయకుమార్ , బండారు మధు పరిశీలించారు.

వర్షాలకు నానుతున్న ఇళ్లు



భీమడోలు బీసీ కాలనీలోని ఇంటి వద్దకు చేరిన వరద నీరు

భీమడోలు: మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లోని ఇళ్లు నానుతున్నాయి. దీంతో పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను శనివారం రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పరిశీలించారు. గ్రామంలోని బీసీ కాలనీ, ఇందిరా కాలనీ, ఇతర ప్రాంతాల్లో కూలేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను గ్రామస్తులతో కలిసి వీఆర్వో వెజ్జు వినయ్‌కుమార్, గంధం మార్కండేయులు పరిశీలించారు. పాక్షికంగా పాడైన ఇళ్లను పరిశీలించి వారికి భరోసా ఇచ్చారు. ఇప్పటికే కాలనీలోని ప్రధాన రహదారులపైకి నీరు చేరింది. డ్రెయిన్ల తీయకపోవడంతో వర్షపు నీరు చేరి అధ్వానంగా మారింది. మండలంలోని పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.